సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



అయోధ్య రాముడి ధనుస్సు 8లో

అయోధ్య రామ మందిరానికి సమర్పించడానికి తయారు చేయించిన ధనుస్సు గురువారం యలమంచిలి చేరుకుంది.



నేటి నుంచి చదరంగం పోటీలు

కొమ్మాది: గీతం వర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి ఇంటర్ వర్సిటీ మహిళల చెస్ పోటీలు నిర్వహించనున్నారు.



సువర్ణ కాంతులు

దుంబ్రిగుడ: తొలిపొద్దు వేళ సువర్ణకాంతులతో ఆకట్టుకున్న ఈ అద్భుత దృశ్యం గురువారం దుంబ్రిగుడలో ఆవిష్కృతమైంది.

న్యూస్‌రీల్

డీఆర్వోగా సత్యనారాయణ రావు బాధ్యతల స్వీకరణ

సాక్షి, అనకాపల్లి : జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్వో) వైఎస్‌వీకేజిఎస్‌ఎల్ సత్యనారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన అన్నమయ్య జిల్లా రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇక్కడ డీఆర్‌ఓగా పనిచేస్తున్న దయానిధి వీఎంఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ఎక్విజేషన్)కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

తుమ్మపాల: రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయుటకు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పూర్తి సహకారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భూ సమస్యల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి రెవెన్యూ సదస్సులో వీటిని పరిష్కారం చేసుకుంటే ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. గురువారం మొదలైన రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సదస్సుల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. షెడ్యూల్ ప్రకారం ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామంలో రీ-సర్వే చేసి ఉంటే, కొత్తగా తయారు చేసిన ఆర్వోఆర్‌ను గ్రామంలో చదివి, అభ్యంతరాలు ఏమైనా ఉంటే పరిశీలిస్తారన్నారు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

నర్సీపట్నం : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో భూమి తగాదాలు, రీసర్వే అవకతవకలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. రెవెన్యూ గ్రామసభలు డిసెంబర్ 5 నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్ అధికారులు పాల్గొంటారన్నారు. 45 రోజుల్లో సమస్యల పరిష్కారం ఉంటుందన్నారు. సభల అనంతరం రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ టీం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం పరిశీలించి నివేదిక అందజేస్తుందన్నారు.



ఏరియా ఆస్పత్రికి నిర్లక్ష్యం జబ్బు

- నక్కపల్లిలో మూతపడ్డ ఎక్స్‌రే ప్లాంట్
- గత ప్రభుత్వంలో రూ.50 లక్షల విలువైన పరికరాలు అందజేత
- ప్రత్యేక గదిని నిర్మించడానికి డబ్బుల్లేవట
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూలకు చేరిన పరికరాలు

నక్కపల్లి :

రాష్ట్ర హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న నక్కపల్లి 50 పడకల ఏరియా ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ మూతపడింది. 3 నెలల నుంచి ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. ఇక్కడ ఇరవై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎక్స్‌రే ప్లాంట్, మెషిన్‌లకు మరమ్మతులు రావడంతో రోగులకు ఎక్స్‌రేలు తీయడం లేదు. కొద్ది రోజుల పాటు యలమంచిలి నుంచి మిషన్ తెచ్చి వాడుతున్నప్పటికీ అది కూడా సక్రమంగా పనిచేయడం లేదు. మూడు మాసాల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ ఆస్పత్రికి వివిధ రకాల వైద్య సేవల కోసం 200 నుంచి 350 మంది వరకు వస్తుంటారు. నెలకు సగటున 1200 మందికి ఎక్స్‌రేలు తీసి వైద్యసేవలు అందిస్తుంటారు.



త్వరలోనే ఎక్స్‌రే ప్లాంటు నిర్మాణం

కొత్త ఎక్స్‌రే పరికరాలు ఆస్పత్రికి చేరిన విషయం వాస్తవమే. ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన గది అందుబాటులో లేదు. మంత్రి అనిత దృష్టి కెళ్లడంతో ఆమె సీఎస్ఆర్ నుంచి నిధులు కేటాయించాలని హెటిరో కంపెనీ వారిని కోరడం జరిగింది. త్వరలోనే కొత్త ఎక్స్‌రే ప్లాంట్ అందుబాటులోకి తీసుకు వస్తాం. **–డాక్టర్ శిరీష**, సూపరింటెండెంట్

జగన్ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి అప్‌గ్రేడ్...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రెండేళ్ల క్రితం ఈ ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకల స్థాయికి పెంచారు. రూ.3 కోట్లు మంజూరు చేయించడంతో అదనపు భవనాలను సైతం నిర్మించారు.

అత్యవసర వైద్య సేవల కోసం ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పీడియాట్రీషియన్, ఆర్థోపెడిక్, డెంటిస్ట్, గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్ తదితర వైద్య నిపుణులను నియమించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రిలో 20 ఏళ్ల నాటి ఎక్స్‌రే ప్లాంట్ తరుచూ రిపేర్లు వస్తుండంతో రూ.50 లక్షలు విలువైన ఆధునిక డిజిటల్ ఎక్స్‌రే మెషీన్లు కూడా సమకూర్చారు. 8 నెలల క్రితమే ఈ పరికరాలు నక్కపల్లి ఆస్పత్రికి చేరాయి. ఈ మెషీన్లు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేకంగా గదిని నిర్మించాలి. ఎల్‌ఈడీ డోర్ ఏర్పాటు చేయాలి. దీనికి రూ.7.50 లక్షలు ఖర్చవుతుందని వైద్య విధాన పరిషత్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. అయితే నిధుల్లేవని కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో సీఎస్ఆర్ నిధులు అందించాలని హెటిరో రసాయన పరిశ్రమ వారిని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, హోంమంత్రి అనిత కోరినట్టు సమాచారం. రూ.ఏడున్నర లక్షలుపెట్టి ఎక్స్‌రే గదిని నిర్మించలేక రూ.50 లక్షలతో సమకూర్చిన మెషీన్లను అలా వదిలేసారని రోగులు ఆరోపిస్తున్నారు.



ఇన్‌స్టాల్ చేయకపోవడంతో నిరుపయోగంగా మూలన ఉన్న ఎక్స్ రే మెషీన్లు

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు

- అవసరం అయితే పీడీ యాక్టు అమలు
- జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మంత్రి నాదెండ్ల మనోహర్

మహారాణిపేట (విశాఖ): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్రలోని జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులతో జరిగిన ప్రాంతీయ సదస్సులో వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత సజావుగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని, రైతులు, అధికారులతో కూడిన కమిటీని నియమించుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. 6 ఏ కేసులు నమోదు చేయటంతో పాటు పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలని సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ వీర పాండియన్, ఎండీ మంజిల్ జిలానీ, అనకాపల్లి జేసీ జాహ్నవి, ఉత్తరాంధ్ర జిల్లాల సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

తుమ్మపాల: మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామంలో పర్యటించారు. రామాలయం వీధిలో దీపం-2 పథకం లబ్ధిదారు ఇంటికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి వెళ్లారు. వారింట్లో టీ తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, అందులో దీపం -2 పథకం కింద 81 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారన్నారు. జిల్లాలో 2 లక్షల 20 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, అందులో లక్ష 75 వేల మంది బుక్ చేసుకున్నారన్నారు. అర్హతలు ఉండి దీపం పథకం రాకపోతే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చెయ్యాలన్నారు. అంతకుముందు పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. జేసీ జాహ్నవి, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎస్.మూర్తి, తహసీల్దార్ విజయకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్



విశాఖలో దర్శనం కోసం బారులుదీరిన భక్తులు (ఇన్ సెట్) కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

కనకమహాలక్ష్మీ.. కరుణించమ్మా..

- ఘనంగా తొలి గురువారం పూజలు
- యలమంచిలి, కశింకోట, విశాఖలో తరలివచ్చిన మహిళలు

యలమంచిలి రూరల్/కశింకోట/ డాబాగార్డెన్స్ (విశాఖ): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో తొలి గురువారం పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యలమంచిలి పట్టణ ప్రజల ఆరాధ్యదైవం, సిరులు కురిపించే చల్లని తల్లి ధర్మవరం కనకమహాలక్ష్మి ఆలయంలో వేకువజామున ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. భక్తుల రద్దీ దృష్ట్యా తోపులాటలు జరగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొటారు సాంబ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. దర్శనం ముగించుకున్న భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు.

కశింకోటలో..

కశింకోటలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించారు. తొలి గురువారం సందర్భంగా అమ్మవారిని పూలమాలలు, ఆభరణాలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించారు. వేదమంత్రాల నడుమ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. విశాఖ బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణాలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం, విశేష పూజలు చేశారు. పసుపు కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి దర్శన భాగ్యం కల్పించారు.



కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



యలమంచిలిలో పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

మెగా పేరెంట్స్ మీటింగ్ రేపు

- తల్లిదండ్రులు తప్పకుండా పాల్గొనాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్

సాక్షి, అనకాపల్లి : ఈ నెల 7వ తేదీన పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులే స్వయంగా తయారు చేసిన ఆహ్వాన పత్రికలను అందజేసి ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సమావేశాల్లో విద్యార్థి విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల గురించి తల్లిదండ్రులతో చర్చించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం జరుగుతుందని, మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర ఆటలు నిర్వహిస్తారన్నారు.

వెండితెరపై 'పుష్పా'భిషేకం



నర్సీపట్నంలో థియేటర్ వద్ద వెలిసిన ఫ్లెక్సీలు

- థియేటర్ల వద్ద ప్రేక్షకుల కోలాహలం
- సినిమా విజయంతో అభిమానులకు పండగ
- బాణసంచా, కేక్ కటింగులతో సందడి
- తొలిరోజు 23 థియేటర్లలో 142 షోల ప్రదర్శన
- ఒక్క రోజులోనే జిల్లాలో రూ.2.8 కోట్లకు పైగా కలెక్షన్లు



థియేటర్‌లో వేదిక ఎక్కి అభిమానుల సందడి

మాస్ జాతర



పాయకరావుపేటలో అల్లు అర్జున్ కటౌట్

సాక్షి, అనకాపల్లి:

'పుష్ప-2 ది రూల్' మేనియా ఊపేస్తోంది. జిల్లా వ్యాప్తంగా థియేటర్ల వద్ద కనీవినీ ఎరుగని సందడి నెలకొంది. టికెట్ ధరలు ధరలు పెంచినప్పటికీ తగ్గేదేలే అన్నట్లు హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ థియేటర్లకు పోటెత్తారు. పూనకాలతో ఊగిపోయారు. బుధవారం రాత్రి పలు థియేటర్లలో బెనిఫిట్ షోలు ప్రదర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జిల్లాలో అన్ని థియేటర్లలోను పుష్ప-2 సినిమా రూల్ చేసిందంటే అతిశయోక్తి కాదు. థియేటర్లలో అన్ని స్క్రీన్లు హౌస్‌ఫుల్ కలెక్షన్లు రాబట్టాయి. సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో థియేటర్ల వద్ద పండగ వాతావరణం కనిపించింది. థియేటర్ల వద్ద ఫ్యాన్స్ సంబరం అంబరాన్నంటింది. బెనిఫిట్ షో ప్రదర్శనలో ఫ్యాన్స్ ఈలలు, డాన్స్‌లతో అదరగొట్టారు. బాణసంచా కాల్చి, కేకులు కట్ చేసి, తీన్‌మార్ డాన్స్‌లతో సందడి చేశారు. సినిమాలో అల్లు అర్జున్ ఎంట్రన్స్‌తో పాటు డైలాగ్స్‌కు, డ్యాన్స్‌కు, ఫైట్స్‌కు వెండితెరపై అభిమానులు పూల వర్షం కురిపించారు. జిల్లాలో 23 థియేటర్లలో పుష్ప-2 సినిమా ప్రదర్శించారు. బుధవారం అర్ధరాత్రి షో, గురువారం ఉదయం బెనిఫిట్‌షోతోపాటు రోజుకు ఐదు షోలు ప్రదర్శించారు.

తొలి రోజు రూ.2.8 కోట్లకు పైగా కలెక్షన్లు

పుష్ప-2 కాసుల వర్షం కురిపిస్తోంది. తొలిరోజున 23 థియేటర్లలో 142 షోలను ప్రదర్శించి రూ.2.8 కోట్ల కలెక్షన్ రాబట్టింది. అనకాపల్లి టౌన్‌లో గల 6 థియేటర్లలో ఏడు స్క్రీన్లలో 42 షోలు, నర్సీపట్నంలో పీవీఆర్ మల్టీప్లెక్స్ థియేటర్‌లో ఉన్న నాలుగు స్క్రీన్లలో 22 షోలు, రాజు, బంగార్రాజు థియేటర్లతో కలిపి 32 షోలు ప్రదర్శించారు. ఇంకా యలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, అడ్డురోడ్డు, అచ్యుతాపురం, పరవాడ, నక్కపల్లి, నబ్బవరంలలోని థియేటర్లలో కూడా ఈ సినిమాను ప్రదర్శించారు. ఆన్‌లైన్‌లోనే అత్యధికంగా అడ్వాన్స్ బుకింగ్ ద్వారా టికెట్ల విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. రెండో రోజు కూడా ఇదే క్రేజ్ కనిపిస్తోంది.



అనకాపల్లి థియేటర్ వద్ద ప్రేక్షకుల హడావుడి



ఫ్యాన్స్ హంగామా

నర్సీపట్నం: అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమా రిలీజ్‌తో నర్సీపట్నం సినిమా థియేటర్ల వద్ద ఫ్యాన్స్ సందడి నెలకొంది. ఉదయం 5.30 గంటలకు బెనిఫిట్ షో వేయడంతో పీవీఆర్ సినీ కాంప్లెక్స్‌కు అభిమానులు ఉదయం 4 గంటలకే చేరుకుని హంగామా చేశారు. అభిమానులు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. పీవీఆర్, రాజు డీలక్స్ సినిమా థియేటర్లకు వెళ్లే మార్గంలో అభిమానులు పెద్ద పెద్ద ఫెక్సీలతో నింపేశారు. అభిమానులు బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. నర్సీపట్నం టౌన్‌లో ఆరు థియేటర్లలో పుష్ప-2ను ఒక రోజే 32 షోలు వేశారు.



పాయకరావుపేటలో ఓ థియేటర్ వద్ద అభిమానుల సందడి

డ్రిప్ ఇరిగేషన్‌తో రైతులకు ఎంతో మేలు



స్ప్రింక్లర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

మాడుగుల రూరల్: ఏపీ సూక్ష్మనీటి సాగు పథకంలో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గురువారం ఆమె స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల మంజూరు పత్రాలను ఆరుగురు రైతులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యానవన, కూరగాయల పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో లాభదాయకమన్నారు. జిల్లా సూక్ష్మనీటి సాగు పథకం డి.ఎం.ఐ.ఓ జి.వి.లక్ష్మి, మండల ఉద్యానవన శాఖాధికారి భాను పుష్పలీలావతి, కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పి.వి.జి. కుమార్, ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

ఏయూక్యాంపస్: గీతం వర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్, కన్కర్, మెహల్లా జిల్లాలు, ఒడిశాలోని కందమల్, కలహండి జిల్లాలకు చెందిన 200 గిరిజన యువతీ యువకులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

జాతీయ స్థాయి హాకీ జట్టుకు అభినందన



జాతీయ స్థాయి జట్టు సభ్యులను అభినందిస్తున్న హెటెరో కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి : జాతీయ స్థాయి హాకీ జట్టు సభ్యులను నక్కపల్లి హాకీ క్రీడా ప్రాంగణంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అభినందించారు. గత నెల 8 నుంచి 10వ తేదీ వరకు నక్కపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల హాకీ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయి అండర్-14 జట్టును ఎంపిక చేశారు ఈ జట్టు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్ మండాసూర్‌లో జరగనున్న జాతీయ హాకీ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా హెటెరో గ్రూప్ ప్రతినిధులు హెచ్‌ఆర్ రాజారెడ్డి, ఎస్.కుళ్లారెడ్డి, ఎంఎస్ఎస్ సత్యనారాయణరెడ్డి జాతీయ జట్టుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్ సూట్, యూనిఫామ్, షూస్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరూ సమష్టి కృషితో విజయం సాధించి నక్కపల్లితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నరేష్, వేమగిరి నూకరాజు, బీబీ గర్ల్స్ హైస్కూల్ పీడీ లక్ష్మి, బీఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కోచ్ రాంబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, నానాజీ, రమణ, శివాజీ, మౌళి, ప్రశాంత్ పాల్గొన్నారు.

మట్టిని సంరక్షించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

చోడవరం రూరల్: ప్రతి రైతూ మట్టిని సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. వరల్డ్ సాయిల్ డే సందర్భంగా గురువారం మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో మట్టి సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మట్టిలో ఎటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలు కలవకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించుకుని, ఆ ప్రకారం ఎరువులను మోతాదు మించకుండా వాడాలన్నారు. అనసర ఎరువులను వాడరాదని, అలా చేస్తే మట్టిలో ఉండే పంటలకు మేలు కలిగించే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గి భూమి నిస్సారంగా మారి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే మట్టిని ఎంత ఆరోగ్యవంతంగా ఉంచుకుంటే అంత మంచిగా పండుతుందన్నారు. తద్వారా మానవజాతి కేన్సర్ వంటి రోగాలకు గురికాకుండా ఉంటుందన్నారు. పర్యావరణం సైతం కాలుష్యం కాకుండా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనా సేకరణ పద్ధతులను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. చోడవరం డివిజన్ వ్యవసాయ సహాయకుడు వి.రవీంద్రనాథ్, మండల వ్యవసాయాధికారి ఇ.పావని, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ మురుగుతి రమణ, మాజీ సర్పంచ్ బూర రమణ, గ్రామ ఉద్యాన సహాయకురాలు టి.మంజువాణి, వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన రెడ్డి మంగ

రోలుగుంట : మండలంలోని ఎన్.కొత్తూరు గ్రామానికి చెందిన వివాహిత రెడ్డి మంగ(32) గురువారం మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి చిటికెల రామయ్యమ్మ ఫిర్యాదు మేరకు రోలుగుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రామకృష్ణారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం సుబ్బారాయుడిపాలెంకు చెందిన మంగకు 2015లో రోలుగుంట మండలం ఎన్.కొత్తూరు గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలం సాఫీగా సాగిన వీరి సంసారంలో అప్పలనాయుడు మద్యానికి బానిస కావడంతో వివాదాలు మొదలయ్యాయి. రోజూ ఇంటికి పూటుగా మద్యం తాగి రావడంతో పాటు కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశబూడు. కుటుంబ పోషణకు ఆదాయం చాలకపోవడం, భర్త పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన మంగ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

15 మద్యం బాటిళ్ల స్వాధీనం

నర్సీపట్నం: అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చింపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 15 మద్యం బాటిళ్లతో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది శంకర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్పీకర్ ఇలాకాలో ఇన్‌చార్జులే దిక్కు!

- వేధిస్తున్న అధికారుల కొరత
- బదిలీపై వెళ్లిన వారి స్థానంలో చేరని కొత్తవారు
- ఆర్ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు లేక అవస్థలు
- ఎంపీడీవోతో పాటు ఇద్దరు వెటర్నరీ వైద్యులూ ఇన్‌చార్జులే..
- సచివాలయాల్లోనూ కానరాని సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



సిబ్బంది లేక తెరవని గునుపూడి సచివాలయం

నాతవరం: రాష్ట్ర అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇలాకాలో ఇన్‌చార్జి అధికారుల పాలన సాగుతోంది. నాతవరం మండలంలో పూర్తి స్థాయిలో అధికారులు లేకపోవడంతో పాలన కుంటుపడుతోంది. పనులు సకాలంలో జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడాక అన్ని శాఖల అధికారులను బదిలీ చేసే ప్రక్రియ చేపట్టారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పని చేసిన అధికారుల్లో 95 శాతం మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో చేరాల్సిన కొత్త వారు ఇంతవరకు విధుల్లోకి చేరలేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలం నుంచి బదిలీ అయిన వీఆర్వోల స్థానంలో అధిక శాతం కొత్త వారు చేరలేదు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వే డీటీతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కార్యాలయానికి వచ్చి ప్రజలకు క్షేత్ర స్థాయిలో పని చేసే అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న వీఆర్వోలకు అదనపు బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు.

నెల దాటినా అతీగతీ లేదు..

కూటమి ప్రభుత్వం అధికారుల బదిలీలు అక్టోబర్ 22వ తేదీతో ముగించింది. అధికారుల బదిలీలు పక్రియ పూర్తి చేసి నెల రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు కొత్తగా చేరాల్సిన అధికారుల జాడ కనిపించడం లేదు. పంచాయతీరాజ్ శాఖలో రెగ్యులర్ ఎంపీడీవోను మార్పు చేసి నర్సీపట్నం ఎంపీడీవోగా పని చేస్తున్న ఉషాశ్రీని నాతవరం మండలం ఇన్‌చార్జిగా నియమించారు. ఆమే వారానికి రెండు రోజులు కూడా విధులకు రావడం లేదు. స్పీకర్, ఉన్నతాధికారులు మండల పర్యటనకు వచ్చే సమయంలోనే వీరంతా దర్శనమిస్తున్నారు. అయ్యన్న స్వగ్రామం ఈ మండలానికి సరిహద్దులో ఉంటుంది. దాంతో అయ్యన్న బంధు వర్గానికి ఈ మండలంపై పట్టు ఎక్కువ. వారి ఒత్తిడి తట్టుకోలేక సిబ్బంది విధుల్లో చేరడం లేదన్న విమర్శలు మండలంలో ఉన్నాయి.

మండలంలో మొత్తం పంచాయతీలు **31**
గ్రామ సచివాలయాలు **17**
ఉండాల్సిన అధికారులు **187** మంది
ప్రస్తుతం పని చేస్తున్న సచివాలయ సిబ్బంది **86** మంది
మొత్తం సచివాలయాల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది **101** మంది

మండలంలో ఇదీ పరిస్థితి

- మండలంలో పెద్ద పంచాయతీలైన నాతవరం, ఎం.బి.పట్నం, గునుపూడి, పీకే గూడెంలకు ఇప్పటికీ రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులను నియమించలేదు.
- గొలుగొండ మండలం ఎంఈవో సత్యనారాయణకు నాతవరం ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- నాతవరం, గునుపూడి, శృంగవరం గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాతవరంలో మాత్రమే పశువైద్యాధికారులు ఉన్నారు. మిగతా కేంద్రాల్లో రెగ్యులర్ పశు వైద్యాధికారులు లేరు. ఆయా ప్రాంతాల్లో పశువులకు ఎలాంటి సమస్య వచ్చిన గోపాలమిత్రలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.
- తాండవలోని చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రంలో రెగ్యులర్ అధికారి లేక ఎప్పుడు చూసిన చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం మూసేసి ఉంటుంది.
- వెలుగు కార్యాలయంలో బదిలీ అయిన ఏపీఎం స్థానంలో కొత్త వారిని నియమించలేదు.
- గ్రంథాలయాధికారి లేక ఇంచార్జీతోనే కాలం వెళ్లదీస్తున్నారు.
- ఆర్అండ్‌బీ జేఈ రెగ్యులర్ లేక ఇన్‌చార్జితోనే నడుస్తుంది.
- మండలంలో 17 సచివాలయాల్లో పూర్తి స్థాయి సిబ్బంది లేరు. గునుపూడి సచివాలయంలో ఒక్కరు, వల్సంపేట సచివాలయంలో నలుగురు, శృంగవరం, నాతవరం -2, చమ్మచింత సచివాలయాల్లోలో ముగ్గురేసి సిబ్బంది ఉన్నారు. మిగతా సచివాలయాల్లో బదిలీ అయిన స్థానంలో కొత్తవారిని నియమించలేదు.

చాలా ఇబ్బందిగా ఉంది



గతంలో అన్ని శాఖల్లోనూ పూర్తి స్థాయిలో అధికారులు ఉండేవారు. ఏ పని అయినా సకాలంలో జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రెగ్యులర్ ఎంపీడీవో లేకుండా పోయారు. తహసీల్దార్ కార్యాలయంలో దిగువ స్థాయి సిబ్బంది లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో సచివాలయంలోనే ప్రజలకు పని అయిపోయేది. ప్రస్తుతం మండల కేంద్రానికి వెళ్తున్నా ఫలితం ఉండడం లేదు.

– సాగిన లక్ష్మణమూర్తి,
ఎంపీపీ, నాతవరం మండలం

కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలు



కూటమి ప్రభుత్వంపై కొద్ది రోజుల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత కన్పిస్తోంది. ఎన్నికలు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. చెబుతున్న దానికి, చేస్తున్న దానికి పొంతన ఉండడ లేదు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి గాలికి వదిలేసిన కూటమి నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. స్పీకరు స్పందించి నాతవరం మండలానికి పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలి.

– అడిగర్ల రాజు,
సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

కన్యకాపరమేశ్వరి సన్నిధిలో అయోధ్య రాముడి ధనుస్సు



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధనుస్సుకు పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: అయోధ్య రామ మందిరానికి సమర్పించడానికి హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర్ సీతారామ ఫౌండేషన్ ప్రతినిధి చల్లా శ్రీనివాసశాస్త్రి తయారు చేయించిన ధనుస్సుకు గురువారం యలమంచిలిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ధనుస్సుతో పాటు విల్లును భక్తుల సందర్శనార్థం కొద్ది సేపు ఉంచారు. 13 కిలోల వెండి, కిలో బంగారంతో చెన్నైలో తయారు చేయించిన ధనుస్సు, విల్లును చూసేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా పలు మఠాలకు వీటిని తీసుకెళ్తున్నట్టు రామభక్తులు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆలయాల్లో పూజల తర్వాత 2025 ఏప్రిల్ 6 తర్వాత అయోధ్య బాల రాముని మందిరానికి ధనుస్సును బహూకరిస్తామని వారు తెలిపారు. తాను సినిమాల్లో సౌండ్ ఇంజినీర్‌గా పని చేశానని, రాముడికి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి దొరికిందని చల్లా శ్రీనివాస శాస్త్రి చెప్పారు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి



గంగరాజు(ఫైల్)

నక్కపల్లి: పశువుల మేత కోసం చెట్టెక్కి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గొడిచెర్లలో గురువారం జరిగింది. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అల్లు గంగరాజు(28) గురువారం ఉదయం మేకలకు మేత కోసం పొలానికి వెళ్లాడు. అక్కడున్న వేప చెట్టు ఎక్కి వెదురుకు కత్తి కట్టి కొమ్మలు కొస్తుండగా వెదురు జారి పడి చేతికి గాయమైంది. దీంతో గంగరాజు చెట్టు పైనుంచి జారి పడ్డాడు. తీవ్ర గాయాలు పాలైన ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కుని కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

అనకాపల్లి: ఇద్దరు పిల్లలతో సహా ఓ వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గవరపాలెం పల్లపువీధికి చెందిన వివాహిత, ఆమె పిల్లలు గత నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

'విద్యుత్ చార్జీలపై చంద్రబాబు ద్వంద్వ వైఖరి'



శ్రీనివాసరావు

చీడికాడ : విద్యుత్ చార్జీల పెంపుతో చంద్రబాబు ద్వంద్వ వైఖరి మరోమారు బయటపడిందని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్వగ్రామం ఖండివరంలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు పేరిట ఇప్పటికే ప్రజలను మోసగించిన చంద్రబాబు.. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కూడా మంగళం పాడారన్నారు. వచ్చే నెల నుంచి ఇంధన చార్జీల పేరిట ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసి ప్రజా సంక్షేమానికి చరమ గీతం పాడారని ఆయన విమర్శించారు. చంద్రబాబు, కూటమి నేతలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

వడ్డాది-తాటిపర్తి రోడ్డుకు శంకుస్థాపన

మాడుగుల రూరల్: రూ.23 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో నిర్మించనున్న వడ్డాది-తాటిపర్తి రోడ్డు పనులకు కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం శంకుస్థాపన చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి డిప్యూటీ సీఎం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలునాయుడు రూ.23 కోట్లు మంజూరు చేయించారు. అప్పట్లో టెండరు కూడా ఖరారయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ రోడ్డు పనులు నిలిచిపోయాయి. అదే రోడ్డు పనులకు గురువారం భూమి పూజ చేశారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పి.వి.జి.కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరావు, స్థానిక ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, తహసీల్దారు కె.రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పరవాడ సబ్ డివిజన్ కార్యాలయంలో ఎస్పీ తనిఖీలు



పరవాడ సబ్‌డివిజన్ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ



ఎస్పీ తుహిన్ సిన్హాకు స్వాగతం పలుకుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: మహిళలు, చిన్నారులు, వృద్ధులసమస్యలపై సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పరవాడ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్పీ గురువారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులను సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సబ్‌డివిజన్ పరిధిలో జరిగే తీవ్రమైన కేసులపై ఆరా తీశారు. ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల్లో విచారణ వేగవంతం చేసి, త్వరితగతిన కోర్టుకు నివేదించేలా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగించేలా సదస్సులు నిర్వహించాలన్నారు. బ్యాంకులు, ఏటీఎంలు, ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణ, రవాణా జరిగే మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు తరచూ చేపట్టాలన్నారు. రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సబ్‌డివిజన్‌లో రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

తుమ్మపాల: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కోర్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో మూడు నుంచి నాలుగు నెలలపాటు ఉచితంగా శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత దగ్గరలోని స్కిల్ హబ్‌లలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

స్కిల్ హబ్ పేరు	నిర్వహిస్తున్న కోర్సు	ఫోన్ నంబర్
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రేబాక, అనకాపల్లి	డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్	8143229228
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యలమంచిలి	డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్	8142565416
ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పాయకరావుపేట	డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్	9640138565
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చోడవరం	అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు	9494791935
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సీపట్నం	కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్	9000092227
ప్రభుత్వ జూనియర్ కళాశాల, మాడుగుల	పేషెంట్ రిలేషన్ అసోసియేట్	7981102224
నాక్ శిక్షణ కేంద్రం, మాకవరపాలెం	సీయింగ్ మెషీన్ ఆపరేటర్-నిట్స్	9014765287

ఈ జైలుకు ఏమైంది?



కేంద్ర కారాగారం

ఆరిలోవ(విశాఖ): ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేసిన విశాఖ కేంద్ర కారాగారం వివాదాస్పద ఘటనలతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. నిత్యం ఏదో ఒక సంఘటనతో జైళ్ల శాఖ ఉన్నతాధికారుల దృష్టిలో పడుతోంది. ఇటీవల జరిగిన ఘటనలపై రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ స్థాయి అధికారి దర్యాప్తు చేపట్టి.. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉన్నతాధికారుల పాత్ర ఉందని తేల్చింది. దర్యాప్తులో వెల్లడైన నిజాలు ఆధారంగా రాష్ట్ర హోం శాఖ వారిని సస్పెండ్ చేసింది. ఉన్నతాధికారులపై వేటు పడటంతో కిందిస్థాయి సిబ్బందిలో ఆందోళన నెలకొంది. దీంతో కేంద్ర కారాగారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు జైలులో ఏం జరుగుతోంది? అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

యథేచ్ఛగా మొబైల్ వినియోగం

జైలు నిబంధనల ప్రకారం కారాగారం లోపల మొబైల్ ఫోన్ల వాడకం పూర్తిగా నిషేధం. అధికారులు, సిబ్బంది కూడా విధుల సమయంలో మొబైల్ ఫోన్లను ఉపయోగించకూడదు. అత్యవసర అవసరాల కోసం అధికారులు తమ కార్యాలయాల్లో మాత్రమే ఫోన్లను ఉపయోగించుకోవచ్చు. అయితే అధికారులు, సిబ్బంది ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ జైలు లోపల విచ్చలవిడిగా మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నట్లు జైళ్ల శాఖ ఉన్నతాధికారుల దర్యాప్తులో తేలింది. గత జైలు సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్లు సెల్‌ఫోన్లు వినియోగించినట్లు తమ నివేదికలో పేర్కొన్నారు. వారి మొబైల్ ఫోన్ల నుంచి రాత్రుళ్లు కొందరు ఖైదీలు బయట వ్యక్తులతో మాట్లాడినట్లు గుర్తించారు. ఏసీబీ దాడుల్లో పట్టుబడిన అధికారులు, ఎవరైనా రాజకీయ నాయకులు రిమాండ్‌కు వస్తే ఇక్కడి అధికారులు, సిబ్బందికి పండగే.! అలాంటి వారికి సపర్యలు చేస్తూ.. కుటుంబ సభ్యులు, అవసరమైనవారితో తమ సెల్‌ఫోన్ల నుంచి మాట్లాడిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం వారి నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్నారని తెలిసింది. కింది స్థాయి సిబ్బంది కూడా మొబైల్ ఫోన్లను యథేచ్ఛగా ఉపయోగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

శిక్ష పడిన ఖైదీ ఆత్మహత్య

ఈ ఏడాది జూలై 30న జైలు గోదావరి బేరక్‌లోని బాత్ రూం వెంటిలేటర్‌కు ఉప్పాడ గౌరీ శంకర్(25) అనే శిక్ష పడిన ఖైదీ ఆత్మహత్య చేసుకున్నాడు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఉన్నతాధికారులు చేపట్టిన దర్యాప్తులో తేలింది. ఇక జైలు లోపల ఖైదీలకు గంజాయితో పాటు బీడీలు సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు ఇటీవల జరిగిన ఘటనే నిదర్శనం. జైలు ఫార్మాసిస్ట్ తన లంచ్ క్యారేజీ బాక్స్‌లో గంజాయి తీసుకెళ్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన కూడా ఇద్దరు అధికారుల సస్పెన్షన్‌కు కారణంగా తెలుస్తోంది. ఆ ఫార్మాసిస్ట్ గతేడాది నుంచి ఇద్దరు ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఆయనపై అధికారులు ఉదాసీనత ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రూపుల గోల

బదిలీపై అనంతపురం కారాగారానికి సూపరింటెండెంట్‌గా వెళ్లిన కిశోర్‌కుమార్, నెల్లూరు జైలుకు అదనపు సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లిన వెంకటేశ్వరరావు విశాఖ జైలులో రెండు గ్రూపులు నిర్వహించినట్లు తెలిసింది. ఒక్కో గ్రూపు సిబ్బంది ద్వారా అనుకూలమైన ఖైదీలకు సపర్యలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి సరఫరా చేసిన ఫార్మాసిస్ట్‌కు ఇద్దరు అధికారులు సహకరించినట్లు సమాచారం. ఇక్కడ గ్రూపులు ఉన్నట్లు గుర్తించిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులు.. ఇద్దరిపై ఒకేసారి బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామిని దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేటలో అభయాంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణతో రూపకల్పన చేసి తెల్లవారుజాము నుంచి సింధూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఐదు వేల మందికి భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, పీలా తులసీరామ్, అధ్యక్షుడు దొడ్డి జగ్గారావు, కార్యదర్శి ఆడారి రాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో తీగల మరమ్మతులు, కొత్త లైన్లు ఏర్పాటు, జంగిల్ క్లియర్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డి–1 సెక్షన్ పరిధిలో రైల్వే స్టేషన్ రహదారి, తాకాశివీధి, రింగ్‌రోడ్డు, లక్ష్మీనారాయణనగర్, మసీదు వీధి, నెయ్యిలవీధి, న్యూకాలనీ, ఏఎంసీ కాలనీ, పీలావారివీధి, చిన్నవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, స్థానికులు సహకరించాలని కోరారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. జనవరి 14వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. అదే నెల 11న కూడార్తై ఉత్సవం, 13న బోగి సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. స్వామివారిని విష్ణుమూర్తి దశావతారాలను మూడు రోజులకు ఒక అవతారం వంతున అలంకరించి పూజించనున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 1,351 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,500	4,200
మొదటి రకం	3,410	4,280
రెండో రకం	2,930	3,770
మూడోరకం	2,800	3,080

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
పుష్ప-2	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–7 యూనిట్లు, బీ పాజిటివ్–9 యూనిట్లు, ఓ పాజిటివ్–10 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 332 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

100 రోజుల యాక్షన్ ప్లాన్



జీవీఎంసీ వేల్పులవీధి టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినులు

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- 2,438 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం

అనకాపల్లి: ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే అనకాపల్లి మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం విద్యా శాఖ పంపించిన నూతన టైమ్ టేబుల్ ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంటపాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు.

- అనకాపల్లి పట్టణ పరిధిలో ఆరు హైస్కూళ్లు, మండల పరిధిలో ఎనిమిది హైస్కూళ్లు ఉన్నాయి. ఆయా హైస్కూళ్లలో 2,438 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించినప్పటికీ కొన్ని హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో సిలబస్ అవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీలోపు ఎస్‌సీఈఆర్టీ సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది.

యాక్షన్ ప్లాన్..

- విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులను గుర్తించి, తృతీయ స్థానంలో ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయిస్తున్నారు.
- రోజూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున వారానికి 7 సబ్జెక్టులు బోధిస్తున్నారు.
- ప్రత్యేక తరగతులు ద్వారా విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తున్నారు.
- ఇప్పటి వరకూ ఫార్మట్ – 1, 2 పరీక్షలు విద్యార్థులు రాశారు.
- సమ్మెట్ –1 పరీక్షలు ఈ నెల 11వ తేదీ నుంచి జరగగా, జనవరి లేదా ఫిబ్రవరి మొదటి వారంలో సమ్మెట్ –2 పరీక్షలు జరగనున్నాయి.

ప్రత్యేక తరగతుల నిర్వహణ బాగుంది



ప్రత్యేక తరగతుల వల్ల మాకు మరింత సమయం చదువుకునే అవకాశం కలుగుతుంది. మాకు వచ్చే సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. ఇష్టపడి చదివితే భవిష్యత్ బాగుంటుంది.

– వసుంధర, పదో తరగతి విద్యార్థిని, జీవీఎంసీ మెయిన్ హైస్కూల్, అనకాపల్లి

సిలబస్ రివిజన్ చేస్తున్నారు



సాయంత్రం సమయంలో మాకు కొంచెం ఇబ్బందిగా ఉన్నప్పటికీ ప్రత్యేక తరగతుల్లో సిలబస్ రివిజన్ చేస్తున్నారు. స్కూలు నుంచి ఇంటికి వెళ్లిన వెంటనే ఆటపై దృష్టిపడుతోంది. ఇక్కడే ఉండి చదువుకోవడం వల్ల తోటి విద్యార్థులతో పోటీపడి నేర్చుకుంటున్నాం. సాయంత్రం సమయంలో స్కూల్‌లో ఉండడం వల్ల ఆకలి వేస్తోంది. కొద్దిగా ఏమైనా ఇస్తే బాగుంటుంది.

– బుచ్చిరాజు శ్యామ్ శంకర్, పదో తరగతి విద్యార్థి, జీవీఎంసీ మెయిన్ హైస్కూల్ అనకాపల్లి

ఫార్మెట్ పరీక్షలు బాగా రాశా



ఫార్మెట్ పరీక్షలు బాగా రాశాను. సోషల్, హిందీ పరీక్షలు అంటే కొద్దిగా భయంగా ఉంది. అయినప్పటికీ పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించాలని ఉంది. కష్టపడి చదువుతున్నాను. ఉపాధ్యాయులకు నా సమస్యను ఇప్పటికే చెప్పాను.

– స్రవంతి, విద్యార్థిని, టౌన్ గర్ల్స్ హైస్కూల్, అనకాపల్లి

హిందీ అంటే భయంగా ఉంది



నాకు గణితం అంటే బాగా ఇష్టం. పెద్దయిన తర్వాత గణిత టీచర్‌గా పనిచేయాలని ఉంది. హిందీ అంటే భయంగా ఉంది. ప్రత్యేక తరగతుల వల్ల మాకు మేలు జరుగుతుంది. రోజుకు ఒక సబ్జెక్టు ఉదయం, సాయంత్రం చెప్పడం బాగుంది. సందేహాలు వస్తే వెంటనే అడగడం వల్ల అక్కడికక్కడే సమస్య పరిష్కరిస్తున్నారు.

– కె.లిఖిత, పదో తరగతి విద్యార్థిని, టౌన్ గర్ల్స్ హైస్కూల్, అనకాపల్లి

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేశాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే అనకాపల్లి మండలం ప్రథమ స్థానంలో నిలవాలని ఆశిస్తున్నాం. పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే విద్యార్థులు భయపడకుండా ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలి.

– కోటేశ్వరరావు, ఎంఈవో–2, అనకాపల్లి

విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు



మాట్లాడుతున్న బొడ్డేడ శివ, కె.ఎం.నాయుడు

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజలపై కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు తెలిపారు. గురువారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచేందుకు ఈఆర్సీ నివేదికలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. 2023–24 ఏడాదికి సంబంధించి రూ.9,412 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఆందోళన బాట పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలపై వివిధ రూపాల్లో భారం మోపడం అన్యాయమన్నారు. మద్యం ధరలు తగ్గించినట్లు చెప్పి, విద్యుత్ చార్జీలు పెండం సిగ్గుచేటన్నారు. నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం నాలుగు నెలలుగా విఫలమైందన్నారు. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా రానున్న రోజుల్లో దశలు వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ మున్నూరు శ్రీను, పార్టీ నాయకులు పిల్లా రాజు, దొడ్డి హరి, మద్దాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు కోరారు. శారదా బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక నర్సింగరావుపేటలో ఏర్పాటు చేసిన బాల గౌరమ్మ ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ పట్టణ, మండలంలో గౌరీపరమేశ్వరులు, గ్రామదేవతల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. వీటిని నిర్వహించే సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ మందపాటి సునీత ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శబరిమలైకు అయ్యప్పభక్తులు



చింతలపాలెంలో అయ్యప్ప భక్తుల ఆతిథ్యం



అనకాపల్లి రైల్వే స్టేషన్లో వేల్పులవీధికి చెందిన అయ్యప్ప స్వాములు

కశింకోట: అయ్యప్ప స్వాముల పాదయాత్ర గురువారం చింతలపాలెం గ్రామానికి చేరుకుంది. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం రాజుల రామచంద్రపురం గ్రామానికి చెందిన బొత్స చిన్నారావు, సోపేటి రాము స్వాములు కేరళలో శబరిమలైకి కాలినడకన బయలు దేరారు. వారికి చింతలపాలెంలో గురు అయ్యప్పస్వామి జెర్రిపోతుల నూకునాయుడు సాదరంగా ఆహ్వానించి ఆతిథ్యమిచ్చారు. అక్కడి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శింపజేసి, అక్కడి నుంచి కొంతదూరం వెళ్లి పండ్లు, ఫలహారాలు అందించి సాగనంపారు. అయ్యప్ప భక్తులు యర్ర జ్యోతికుమార్, గోవింద్, పీలా కిరణ్‌కుమార్, దూళి దేముళ్లు, ప్రసన్న పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి పంబా పీఠం అయ్యప్పస్వాములు గురువారం ఇరుముడి కట్టుకుని కేరళలో శబరిమలైకు రైల్లో బయలుదేరారు. వీరంతా 41 రోజులు దీక్షలు పూర్తి చేసుకున్నారు. పీఠం వద్ద అయ్యప్పస్వామి అంబలం పూజ చేశారు. శబరిమలైలో అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. సుమారుగా 40 మంది అయ్యప్పలు బయలు దేరినట్లు పీఠం గురుస్వామి బుదిరెడ్డి మురళీకృష్ణ, ఒమ్మి రామకృష్ణ చెప్పారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు



సామూహిక సహస్ర నామార్చన చేస్తున్న భక్తులు



బారులు తీరిన భక్తులు



బయట కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

కశింకోట: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మొదటి గురువారం కావడంతో ఉదయం నుంచి బారులు తీరారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలు, ఆభరణాలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించారు. వేదమంత్రాల నడుమ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ముందుగా ఆలయం బయట అమ్మవారి విగ్రహానికి పాలు, ఇతర పూజా ద్రవ్యాలతో పూజలు చేసి ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించారు. చీరలు, రవికెలు, అరటి పండ్లు, పూలు వగైరా సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి భక్తి పారవశ్యంతో తన్మయత్వం చెందారు. ఆలయంలో సామూహికంగా లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, మాజీ అధ్యక్షుడు దాడి నాగరాజు, మాజీ వార్డు సభ్యురాలు సూరిశెట్టి రేవతి పర్యవేక్షించారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



బస్సు స్టేషన్ వద్ద బోల్తా పడి దెబ్బతిన్న కారు

కశింకోట: స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ వద్ద గురువారం పెద్ద ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు ఇక్కడకు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డులో బోల్తా పడింది. దీంతో దానిలో ప్రయాణిస్తున్న విశాఖకు చెందిన డ్రైవర్ సహా ఏడుగురు ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాలేదని, లేదంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. అయితే వారి వివరాలు తెలియరాలేదు. కారు ముందు భాగం, చక్రాలు బాగా దెబ్బతిన్నాయి. దీనిపై ఫిర్యాదు రాలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

నేడు అంబేడ్కర్ 68వ వర్ధంతి

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

మట్టి పరిరక్షణతో మనుగడ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రంగాచారి

అనకాపల్లి: మండలంలో మార్టూరు ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ మృత్తిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మట్టి సంరక్షణ–మన భవిష్యత్తుకు బంగారు పునాది అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు మట్టి విలువను తెలుసుకోవాలన్నారు. ఇది మానవ మనుగడకు, ఆహార ఉత్పత్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నేల ఆరోగ్యంగా ఉండాలంటే పచ్చిరొట్ట పైరును భూమిలో కలియ దున్నినట్లయితే సారవంతమవుతుందన్నారు. పంటలకు అవసరమైన 15 రకాల పోషకాలను సమృద్ధిగా అందించి, నాణ్యమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయుటకు దోహదపడుతుందన్నారు. ఎరువులను పురుగుల మందులను వాడటం వల్ల నేల నిస్సారమై పంటలు పండకపోవడం వల్ల సరైన ఆహారం దొరకడం కష్టంగా ఉంటుందన్నారు. పంటల ఉత్పత్తి తగ్గినట్లయితే రైతులు దిగుబడులు తగ్గి వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం వహించడం జరుగుతుందన్నారు. దీని వల్ల మానవుని మనుగడకు ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, రవిరాజ్, ప్రవీణ, గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ఉర్దూ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అహ్మద్‌ను హత్య చేయడం అన్యాయమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి స్థానిక నెహ్రూ చౌక్ వద్ద అహ్మద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఉపాధ్యాయులు కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు కుటుంబానికి ప్రభుత్వం రూ.5 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రక్షణ కల్పించే విధంగా చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఏ ఓంరామ్, ఎ.రమణ, సిహెచ్ రమణ, విశ్రాంత ఎస్‌సీసీ అధికారి వై.సత్యం, యూటీఎఫ్ నాయకులు సతీష్, కృష్ణమోహన్, జి.రాజు, బాలాజీ, డి.నూకరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి వృద్ధుల సమస్యలు

అనకాపల్లి: వృద్ధులు ఐక్యంగా ఉంటూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామీణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. గురువారం స్థానిక వి.వి.రమణ రైతు భారతిలో సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వడం తప్ప, మిగిలిన రాయితీలు ఏమి అమలు చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2007లో చట్ట ప్రకారం వృద్ధులకు రావలసిన పథకాలను తుంగలో తొక్కి కాలరాస్తున్నాయన్నారు. రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలని, ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)లో 50 శాతం రాయితీ కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధుల సమావేశానికి భవనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అప్పారావు, దాడి జగదీష్, కె.త్రినాథ్, జగ్గారావు, కర్రి సూర్యనారాయణ, బుద్ధ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జై భీమ్ అసోసియేషన్ వార్షికోత్సవం



మిఠాయిలు పంచి పెడుతున్న సత్యనారాయణ

అనకాపల్లి: జై భీమ్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) డిపో వద్ద అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.ఎస్.ఎస్. సత్యనారాయణ కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో అధ్యక్షుడు కె.ఎస్.రావు, కార్యదర్శులు ఎ.బి.రాజు, డిపో వర్కింగ్ అధ్యక్షుడు వి.ఎ.రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ప్రదానం



విద్యార్థులకు ఇవ్వనున్న ప్రోగ్రెస్ కార్డులు

కశింకోట: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల(సమగ్ర ప్రగతి పత్రం)ను అందజేయనున్నట్లు ఎంఈవోలు వెంకట సురేష్, ఏవీఎన్ మూర్తి తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఈ నెల 7న మెగా పేరెంట్స్ సమావేశాలు జరగనున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు తీరు తల్లిదండ్రులకు తెలిసే విధంగా ప్రోగ్రెస్ కార్డులను అందివ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కార్డులు ఆయా స్కూళ్లలో సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక హెల్త్ కార్డులు విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. పేరెంట్స్ సమావేశాల నిర్వహణ షెడ్యూలు పాఠశాలలకు అందించామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంశాల వారీగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముందు తరగతుల వారీగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమవుతారన్నారు. ఆ తర్వాత అన్ని తరగతులకు కలిపి విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశం స్కూలు బయట జరుగుతుందన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భోజన సదుపాయం ఉంటుందన్నారు.

తగ్గని కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో కూరగాయల ధరలు బెట్టు దిగలేదు. గురువారం బంగాళదుంప కిలో రూ.40 నుంచి రూ.50కి పెరిగింది. క్యారెట్ రూ.వంద నుంచి దిగలేదు. టమాటా, ఉల్లి నాణ్యతను అనుసరించి రూ.50 నుంచి రూ.60కి అమ్మకాలు సాగాయి. బీరకాయ, వంకాయ, చామదుంప, బీట్రూట్ రూ.60, బెండకాయ, క్యాబేజీ రూ.40, పాదు చిక్కుడు, బీన్స్ పిక్కలు, బరబాటి రూ.80, ఆగాకర రూ.వందకు విక్రయాలు సాగాయి. కాలీ ఫ్లవర్ పరిమాణం అనుసరించి రూ.20 నుంచి రూ.30 వరకు అమ్మకాలు సాగాయి.